# తెరపడింది

"కిడ్నాపయి తిరిగొచ్చిన మీ అమ్మాయి శీలాన్ని శంకించకుండా ఎలా వుండ మంటారండీ! మూడు రోజులు కనపడకపోతే పోలీస్ రిపోర్టిచ్చి, వెతికించి తీసుకొచ్చాను. సంతోషించండి- నేను మాత్రం మీ అమ్మాయిని ఏలుకోలేను'' అంటున్న అల్లుడిని వెర్రి వాడిలా చూస్తూ వుండి పోయాడు కనకయ్యగారు.

''నాన్నా ఈయన అన్నీ అబద్ధాలు చెప్తున్నారు. మార్కెట్ నుంచి వస్తున్న నన్ను జనంలేని చోట ఎవరో టాక్సీలోకి బలవంతాన ఎక్కించుకుని తీసుకెళ్ళి ఓ గదిలో వుంచి, విడిచిపెట్టారంతే... వాళ్ళు నన్నేమీ చెయ్యలేదు'' అంటున్న చిత్రని అలోక్ వెటకారంగా చూస్తూ...

''అయితే నిన్నెందుకు కిడ్నాప్ చేశారుట? పాతికేళ్ళ వయసులో వున్న నిన్ను కిడ్నాప్ చేసే అవసరం ఆ దుండగులకెందుకొచ్చిందిట? నీ వయసు చూసి కాదా? బంగారం కోసమే అయితే నీ వంటి మీదున్న ఒక్క నగా ముట్టుకోలేదేం? పోనీ కిడ్నాప్ చేసి ఇంత డబ్బు కావాలని ఫోన్ కాలన్నా చెయ్యలేదేం?'' అంటున్న భర్తని అస హ్యంగా చూస్తూ...

''అది మీకే తెలుసు'' అంటున్న చిత్రని చూడ కుండా ...

''కనకయ్యగారూ! మీ అమ్మాయిని మీ దగ్గరే వుంచుకోండి- నేను తీసుకెళ్తే నలుగురూ నన్ను నవ్వుతారు'' అంటోన్న అలోక్ చేతులు పట్టుకుని...

''బాబూ! ఎవరో దుండగులు చేసిన పనికి మా అమ్మాయి తప్పేముంది బాబూ! నీకుమాత్రం తెలీదా? నా పిల్ల ఎలాంటిదో, పెళ్ళయి ఏడాదన్నా కాలేదు. అప్పుడే ఈ గొడవేమిటి బాబూ! కాస్త ఆలోచించు- నా కూతురి తప్పేంలేనప్పుడు దానికెందుకీ శిక్ష? నిప్పులాంటి నా కూతురిమీద అలాంటి నిందె య్యకు బాబూ! పేపర్లల్లో చిత్ర కిడ్నాప్ గురించి రావడంతో మేమెంత మానసికంగా క్రుంగిపోయామో నీకూ తెలుసు.

పిల్ల క్షేమంగా తిరి గొచ్చింది అదే పదివేలను కుంటోంటే ఈ గొడవ మమ్మల్ని తలెత్తుకు తిరగ నిస్తుందా బాబూ,దాన్ని తీసుకెళ్ళు- కొన్నాళ్ళకి లోకం ఇదంతా మర్చిపోయి మామూలయి పోతుంది'' అంటున్న కనకయ్య గారి వంక వెటకారంగా చూస్తూ-

''పోలీసు రిపోర్టిచ్చి, పేపర్లల్లో వేయించి మీ పిల్లని వెతికించి మీకు తెచ్చిచ్చాను సంతోషించండి. నేనే పట్టించుకోకపోతే మీ అమ్మాయిని వాడుకున్నన్నాళ్ళూ వాడుకుని ఏ రెడ్‌లైట్ ఏరియాకో అమ్మేసి వుండేవారు. క్షేమంగా మీ పిల్లని మీకప్పగించాను- ఏం చేసుకుంటారో మీ ఇష్టం'' అంటూ వెళ్ళిపోతున్న అలోక్ వైపు అచేత నంగా నిలబడి చూడసాగారు కనకయ్యగారూ, భార్యా, చిత్రలూ.

''హే భగవాన్ వున్న ఒక్కకూతురికీ మంచి సంబంధం చేసానన్న ఆనందంతో గుండెమీద చెయ్యేసుకుని రోజులు గడుపుతున్న కనకయ్య దంపతులకి ఇలాంటి దెబ్బ తగలడం తట్టుకోలేక పోతున్నారు. మూడు రోజులు పిల్ల కనపడలేదన్న బెంగ, ఇప్పుడు ఈ నిందతో కూతుర్ని ఇంటికి పంపెయ్యడం-తట్టుకోలేకపోతున్నారు.

ఇందులో చిత్ర తప్పేం చేసింది? కానీ లోకానికే సంగతులు కావాలా?లోకం ఎవరికి తోచినట్లు వాళ్ళు కథ లల్లి చిత్ర గురించి చెప్పుకుంటున్నారు. చిత్ర కుటుంబం నలుగుర్లో తలెత్తుకు తిరగలేక సిగ్గుతో చితికిపోతోంది.

చిత్ర నిర్వికారంగా ఎవ్వరితో మాట్లాడకుండా ఇంట్లోనే తిరుగుతోంది.

ఒకరోజు తండ్రి దగ్గరకొచ్చి చిత్ర ''నాన్నగారూ!

**కందుకూరి వెంకట మహాలక్ష్మి**

# మహనీయుల మాట-మంచిమాట

తెలుగు భాషకొరకు తెగువతో కొట్లాడి
ప్రాచీన హోదాకు పోరు చేసే
పాఠశాలల్లో పరాయి భాషరా?
మహనీయుల మాట మంచిబాట
ఎచ్చులకుపోయి ఇంగ్లీషు చదువనిరి
అక్షరం రాదాయె అక్కరతీరదాయె
పసలేని చదువాయె పనికి రాకపోయె
మహనీయుల మాట మంచిబాట
ఆంగ్లమాధ్యమ పాఠాలు అర్థమవ్వకపోయె
మమ్మీడాడి పదాలె మిగిలిపాయె
సక్సెస్ స్కూల్సే ఫెయిల్ అయ్యెరా
మహనీయుల మాట మంచిబాట
దేశ భాషలు వద్దని వేశభాషలు మార్చి
కాన్వెంట్ చదువని కోరుకొనిపోతె
కాన్సెప్ట్ స్కూళ్ళన్ని కంగాళి స్కూళ్ళాయె
మహనీయుల మాట మంచిబాట
పల్లెటూళ్లో కూడా పెద్ద చదువులని
ఇంగ్లీషు మీడియమని ఇష్టపడి పోతే
ఆంగ్లరైమ్స్ మినహా ఏమిరాకపోయె
మహనీయుల మాట మంచిబాట
తెలుగు ఆత్మగౌరవమని వెలుగెత్తి చెప్పి
ప్రాణత్యాగాలకు ప్రతిన చేసే
పసిపిల్లలకెందుకు పరాయి భాషరా?
మహనీయుల మాట మంచిబాట
వీధి బడిలో కూడా ఇంగ్లీషు చదువాయె
సర్కారు స్కూళ్ళల్లో ఆంగ్ల మాధ్యమాయె
అధికార భాష తెలుగెట్ల అవునో?
మహనీయుల మాట మంచిబాట

కెమెరా

నేను కాలేజీలో చేరి లా చేద్దామనుకుంటున్నాను'' అనగానే...

కనకయ్యగారు, ఒక్కసారి తలెత్తి కూతుర్ని చూసి, రెండు నిమిషాల తరవాత ''సరే నీ ఇష్టం తల్లీ'' అన్నారు.

ఆ మర్నాడే కాలేజీకెళ్ళి ఫీజు వగైరాలు కట్టి లాలో చేరింది.

పట్టుదలతో చదివి లా పూర్తి చేసి కోర్టులో రిజిస్ట్రేషన్ చేయించుకుని, జూనియర్ లాయర్‌గా ప్రాక్టీసు ప్రారంభించింది.

నాలుగేళ్ళు గడిచిపోయాయి. మార్కెట్‌కి వగైరాలకి వెళ్ళినప్పుడు అలోక్ మరో అమ్మాయితో చాలాసార్లు కనపడ్డాడు. దగ్గరగా ఎదురుపడ్డప్పుడు చిత్రని చూసి వెటకారంగా నవ్వేవాడు. చిత్ర తన్ని కానట్లే వెళ్ళిపోయేది. అప్పుడప్పుడు తను వినాలని అలోక్ ఆడే వ్యంగమయిన మాటలు చిత్రకి కారం పూసుకున్నట్లుండేవి. కానీ అవేమీ తనని కానట్లే వెళ్ళిపోయేది.

ఒకరోజు అలోక్ ఇంటికెళ్ళి తలుపుతట్టింది చిత్ర. అలోక్ ఆఫీసులో వుండటంతో అతనితో వుంటోన్న అమ్మాయి తలుపు తీసింది. ఎదురుగా చిత్రని చూసి ఏం మాట్లాడాలో తెలీక అలా నిలబడిపోయింది.

''లోపలికి రావచ్చా!'' అన్న చిత్ర మాటలకి పక్కకి తప్పుకుని ''రండి'' అందా అమ్మాయి.

''మీ పేరు రమ్య కదూ'' అన్నదానికి అవునన్నట్లు తలూపింది రమ్య.

''రమ్యగారూ! అలోక్‌కి నేను మొదటి భార్యని మీకు తెలుసా?'' అన్నదానికి...

''అవును చెప్పారు. మీరు ఎవరితోటో మూడు రోజులున్నారనీ...'' అంటున్న మాటల్ని పూర్తికానివ్వకుండానే ''అబద్ధం అలోకే నన్ను కిడ్నాప్ చేయించాడు. మీ ఇద్దరికీ అడ్డుగా వున్న నన్ను అడ్డు తొలగించుకోడానికి ఆడిన నాటకం అది. మా పెళ్ళికి ముందునుంచీ వున్న మీ ప్రేమాయణం నాకు తెలిసింది. అందుకే నన్నూ, నా జీవితాన్నీ బలిపెట్టాడు. ఈ నాటకం ఆడకుండా ముందే మిమ్మల్ని పెళ్ళి చేసుకోవచ్చుకదా!'' అంటున్న చిత్రవైపు చూసి...

''చిత్రగారూ కాలేజీ రోజుల్నుంచీ మేం ప్రేమికులం. నిజమే! మా కుటుంబం చాలా బీదది. మా వాళ్ళు కట్న కానుకలు ఇచ్చుకోలేరు దాంతో తల్లిదండ్రులు తెచ్చిన

## నిజమైన స్వాతంత్ర్యం

గాంధీజీకి తెలిసుండదు
ఈ దేశం యింత ముందుకుపోతుందని
అందుకే అన్నాడు
అర్థరాత్రి ఆడపిల్ల
నడివీధిలోనిర్భయంగా
సంచరించగలిగినప్పుడే
నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్లని.
బ్రతికుంటే-
ఇప్పుడు చెప్పేవాడు
మంత్రులు, మహామంత్రులు,
ప్రజా ప్రతినిధులూ,
పార్టీ నాయకులూ,
అవేవీకాని కొందరు ప్రముఖులు కూడా
ఏ రక్షణా లేకుండా
మనుషులమధ్య
తిరగగలిగినపుడే
అసలు సిసలు స్వాతంత్ర్యం వచ్చినట్లని.

*అయినాల కనకరత్నాచారి*

సంబంధాన్ని ఒప్పుకుని, తలొంచుకుని పెళ్ళి చేసుకున్నారు. ప్రాణం కన్నా మిన్నగా ప్రేమించుకున్న మా జీవితాలు డబ్బుకోసం నాశనమవ్వాలా? మా బీదరికం ప్రేమకి అడ్డనుకున్న ఆయన తల్లిదండ్రుల్నీ విషయం అడగండి. డబ్బుకీ, ప్రేమకీ సంబంధంలేదు. నిన్నగాక మొన్న పెళ్ళయిన మీకే ఇంత అధికారం వుంటే, ఎన్నో ఏళ్ళుగా ఒకరికోసం ఒకరం బ్రతుకుతున్న మాకెంత అధికారం వుంటుంది'' అని అంటున్న రమ్యని చూసి...

''అయితే నన్ను పెళ్ళాడి తల్లిదండ్రుల ముచ్చట్లు తీరగానే నన్ను అడ్డుతొలగించుకుని మిమ్మల్ని పెళ్ళి చేసుకున్నాడా? నాకు విడాకులివ్వకుండా మళ్ళీ పెళ్ళి చేసుకోవచ్చా? దాని పర్యవసానమేమిటో తెలుసా?'' అంటున్న చిత్రని పిచ్చిదానిలా చూస్తున్న రమ్యని తప్పించుకుని బైటికొచ్చేసింది చిత్ర.

సాయంకాలం అలోక్ రాగానే రమ్య చిత్ర వచ్చి ఆడిన మాటలన్నీ చెప్పింది. ''ఏడిసింది. అది నన్నేం చెయ్యగలదు? ఇప్పటికి దానిపీడ విరగడయి అయిదేళ్ళయింది. ఇన్నేళ్ళూ నోరెత్తలేనిది ఇప్పుడేం చేస్తుందిట! దాని బాబే నోరుమూసుకుని కూర్చున్నాడు!'' అంటూ రమ్య మాటల్ని పట్టించుకోనట్లు నటిస్తూ- 'దాని సంగతి చూస్తా'ననుకున్నాడు మనసులో.

మర్నాడు సాయంకాలం చిత్ర ఇంటికెళ్ళాడు అలోక్. చిత్ర తలుపు తీస్తూనే అతన్ని రమ్మనయినా అనకుండా గుమ్మానికి అడ్డుతప్పుకుని లోపలికెళ్ళింది. కాస్సేపటికి బైటికొచ్చిన చిత్రని మింగేస్తున్నట్లు చూస్తూ ''ఎంత ధైర్యమే నీకు? నా ఇంటికే వచ్చి నా పెళ్ళాన్నే బెదిరిస్తావా? ఎవడో తీసుకెళ్ళాడని చెప్పి వాళ్ళతో మూడు రోజులుండి రాలేదా? మహా పతివ్రతలా మాట్లాడతావేమిటి? నువ్వెళ్ళిపోయాక నేను ప్రేమించినమ్మాయిని పెళ్ళి చేసుకున్నాను! అందులో తప్పేమిటి?''అంటున్న అలోక్‌ని అడ్డుకుని-

''ఏయ్ నువ్వే నన్ను కిడ్నాప్ చేయించి, ఆ వంకతో నీ అడ్డు తొలగించుకున్నావు'' అంటున్న చిత్రతో...

''సరే కిడ్నాప్ చేయించాను... అయితే ఏమిటంటావు? నా వాళ్ళు నిన్ను బలవంతాన నా పీకలకి కట్టారు. నీతో కాపురం నాకిష్టంలేదు, నిన్నొదుల్చుకుని నాకు నచ్చిన అమ్మాయిని పెళ్ళాడాను. ఏం చేసుకుంటావో చేస్కో... నీ బాబే నన్నేం చెయ్యలేకపోయాడు. నువ్వేం చెయ్యగలవు? పేపర్లలో రిపోర్లున్నాయి. పోలీస్ స్టేషన్‌లో రిపోర్టులున్నాయి. నన్నేం చెయ్యలేవు. నాకా సాక్ష్యాలు చాలు, నీకేం రుజువులున్నాయి? ఏం చేసుకుంటే అది చేసుకో!'' అంటూ రుసరుసా వెళ్ళిపోతున్న అలోక్‌ని నవ్వుతూ చూస్తూ తలుపు వేసుకుంది చిత్ర.

ఈ సంఘటన తరువాత వారం రోజులకి అలోక్ పేర లాయరు నోటీసు వచ్చింది. తెరిచి చూసిన అలోక్ చకితుడే అయ్యాడు. అందులో మొదటి భార్యకి విడాకులివ్వకుండా మరో అమ్మాయిని పెళ్ళిచేసుకోవడం గురించిన నోటీసది. విడాకులివ్వకుండా రెండో పెళ్ళి చేసుకున్నందుకు కోర్టుకు హాజరవమని వుందా నోటీసులో.

కోర్టుకెళ్ళక తప్పలేదు అలోక్‌కి.

అలోక్ తరుపు లాయరు అలోక్ అసలు రెండో వివాహమే చేసుకోలేదనీ, చిత్ర గుణం మంచిదికాక విడిచిపెట్టేసాడనీ, అందుకుగాను సాక్ష్యాధారాలున్నాయనీ, దాంతో చిత్ర అలోక్‌మీద లేనిపోని ప్రచారాలుచేస్తోందనీ, కావాలంటే అలోక్ ఇంటికెళ్ళి చూస్తామనీ, అక్కడ ఏ ఆడదీ లేదనీ వాదించాడు. కోర్టువారు అలోక్ ఇంటికెళ్ళి

చూసారు. ఆ ఇంట్లో మరో ఆడదున్నట్లు ఎక్కడా కనపడలేదు. చాలా తెలివిగా రమ్యని కొన్నాళ్ళు ఇంట్లోంచి వేరే జాగాకి పంపేవాడు. ఇంట్లో ఆడదాని ఆచూకీ లేకపోవడంతో కోర్టువాళ్ళకేమీ ఆధారాలు దొరకలేదు ఈసారి అలోక్ లాయరు ఇంకా గట్టిగా అలోక్ తరుపున వాదించాడు. కేసు వాయిదా పడింది.

జడ్జిమెంటు యిచ్చేరోజు వచ్చింది. చిత్ర కోర్టుకొచ్చి జడ్జీకి రెండు టేప్‌లిచ్చింది. ఒకటి టేప్ రికార్డర్‌లో పెట్టి జడ్జీకి వినిపించింది. అందులో రమ్య గొంతు చిత్ర రమ్య ఇంటికెళ్ళినప్పుడు వాళ్ళిద్దరి మధ్యా జరిగిన సంభాషణంతా అందులో రికార్డయివుంది.

అది వినగానే షాకయ్యాడు అలోక్. ఆ టేప్ అయిపోగానే రెండో టేప్ పెట్టింది. అందులో అలోక్ చిత్ర ఇంటికొచ్చినప్పుడు ఆడిన మాటలు రికార్డయ్యాయి.

అంతా విన్న జడ్జీ అలోక్‌ని జవాబివ్వమని అడిగాడు. అలోక్ ఏమీ మాట్లాడలేకపోయాడు.

వెంటనే చిత్ర లేచి జడ్జీతో ''యువర్ ఆనర్! నేనీ యనింటికెళ్ళినప్పుడూ, ఈయన మా ఇంటికి వచ్చి నప్పుడూ నేను ఈ టేప్ రికార్డర్ ఆన్ చేసి నా జాకెట్‌లో దాచాను. సో రమ్యవీ, ఈయనవీ మాటలన్నీ రికార్డు అయ్యాయి. మొదటి భార్యకి విడాకులివ్వకుండా మళ్ళీ పెళ్ళి చేసుకున్నందుకు ఈయనకి పడవలసిన శిక్ష విధిం చండి'' అనగానే...

''తప్పయిపోయింది సార్! చిత్రని ఏలుకుంటాను. ఇక ఏవిధమైన ఇబ్బందీ పెట్టన''నగానే చిత్రలేచి ''మేక తోలు కప్పుకునే పులినెప్పుడూ నమ్మకూడదు సార్! ఈయనకి పడవలసిన శిక్ష పడాల్సిందే'' అంటూ లేచింది. జడ్జీ అలోక్‌కి ఏడేళ్ళ జైలు శిక్ష విధించినట్లు తీర్పు నిచ్చాడు.

తలొంచుకుని పోలీసులతో వెళ్తున్న అలోక్ దగ్గరకెళ్ళి ''ఏయ్ మిస్టర్! ఎలాగుందీ దెబ్బ? ఆడదంటే చాతకాని దనుకోకు. ఏం చేస్తావు? అన్నావు చూశావా? ఆడాళ్ళని చాలా చులకనగా మాట్లాడటం బాగా నేర్చుకున్నావు. నన్ను కిడ్నాప్ చేయించడం, నీ ఇల్లు సోదాకొచ్చినప్పుడు నీ కీపర్‌ని ఇంట్లోంచి పంపెయ్యడంలాంటివి చేసి, చాలా నేర్పు ప్రదర్శించి, నీ తెలివితేటల్ని చూపించానను కున్నావు. ఆడది అబల కాదు. కావాలంటే తాచుపాము కంటే భయంకరంగా మారగలదు.

నీవు మా ఇంటికొచ్చినప్పుడు లోపలికెళ్ళాను గుర్తుందా? టేప్ రికార్డర్‌ని జాకెట్‌లో దాచి తేవడానికే! నీకోసమే నేను లా చదివా కొన్నేళ్ళు జైలులో మగ్గుతావు. ఉద్యోగం ఊడుతుంది. అప్పుడు నీకు తెలిసొస్తుంది. నీలాంటి తోడేళ్ళని కొందరినయినా నాలాంటి వాళ్ళు పట్టిస్తే దేశం కాస్త బాగుపడుతుంది.

రేపటి పేపర్లల్లో నీ గురించిన కథంతా వస్తుంది. నీ గురించీ, నీ నాటకం గురించీనూ. నీ తల్లిదండ్రులకీ విష యం తెలియజెప్పు.ఇంక పొగరు తగ్గించుకో...గుడ్ బై'' అంటూ వెటకారంగా నవ్వుతూ వెళ్ళిపోతుంది చిత్ర. ■

## కరువొచ్చింది

కరువొచ్చింది
వాగెండిపోయింది
ఇసుక బ్రోకర్ల
పంట పండింది
వానకోసం
వరుణయాగాలు
కుళాయిల వద్ద
పాని'పట్టు' యుద్ధాలు
కరువొచ్చింది
రైతన్న ఎకరం భూమి అమ్మాడు
కరువు పనుల కాంట్రాక్టరు
ఆగిపోయిన ఐదో అంతస్తు పూర్తి చేశాడు.
కరువొచ్చింది
సరుకులు బ్లాకులోకి
ధరలు చుక్కల్లోకి వెళ్ళాయి
పంట పొలాల్లో
పంటలు పండటంలేదు
రియల్టర్లు రూపాయిలు పండిస్తున్నారు
ఇప్పుడు రైతుల కళ్ళు
మబ్బులకోసం ఆకాశంవైపు చూడటంలేదు
ఉరితాళ్ళవైపు చూస్తున్నాయి

*మేరెడ్డి యాదగిరి రెడ్డి*